236 మందికి రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

పొందుగల(మైలవరం): పొందుగల గ్రామంలో మొత్తం 236 మందికి ఇంటి స్థలం పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి గురువారం అందించారు. పొందుగల పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కోటమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న ఇచ్చిన వాగ్దానాలు నెరుస్తున్నారని తెలిపారు. మహిళలకు పెద్ద పీట వేస్తున్నారని, ఆసరా పథకంతో మహిళలు అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇస్లావత్ స్వామి, మాజీ సర్పంచ్ డొంకెన చలపతిరావు, పంచాయతీ కార్యదర్శి రఫీ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కల్పనే లక్ష్యం



జి.కొండూరు: గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి కల్పనే లక్ష్యంగా కుట్టు శిక్షణ తరగతులను నిర్వహించినట్లు ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ అన్నారు. స్థానిక కమ్యూనిటీ హాల్లో మూడునెలలుగా జరుగుతున్న శిక్షణ పూర్తి చేసుకున్న 20మంది మహిళలకు యాభై శాతం రాయితీతో మంజూరైన కుట్టుమిషన్లను గురువారం జెడ్పీటీసీ సభ్యుడు జక్రధరరావుతో కలిసి ఎంపీపీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ శిక్షణ తరగతులతో పాటు మిషన్‌ల కొనుగోలుకు జెడ్పీ నిధులను వెచ్చించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఏ కొండూరు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఎం. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 2018 నుంచి 2020 సంవత్సరం వరకు భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద బీమా పెళ్లికానుక, వైద్య సహాయం ఖర్చుల నిమిత్తం రూ.3.40 లక్షలు అందించినట్లు తెలిపారు. తనిఖీ బృందం ఎస్ఆర్‌పీపీ సింహాద్రి, సహాయ కార్మిక అధికారి శ్యాంబాబు, ఎంపీడీఓ పరమాత్మ, ఏపీఓ రామకృష్ణ పాల్గొన్నారు.

10న ప్రవేశ పరీక్ష

జి.కొండూరు: కుంటముక్కల బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరడానికి ఈ నెల 10వ తేదీన ప్రవేశ పరీక్ష జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటో, పెన్‌తో పరీక్ష సమయానికి గంట ముందు రావాలని సూచించారు.

మహిళా సాధికారతే ధ్యేయం

తిరువూరు: మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వైఎస్సార్ సీపీ తిరువూరు ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. మండలంలోని డ్వాక్రా గ్రూపు మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వైఎస్సార్ చేయూత పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా స్వామిదాసు మాట్లాడుతూ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబం లబ్ధి పొందిందన్నారు. పేదరిక నిర్మూలనకు సంక్షేమ పథకాలు ఇతోధికంగా తోడ్పడుతున్నాయన్నారు. ఎంతో అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు చేయలేని కార్యక్రమాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విజయవంతంగా అమలు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో మహిళలు వైఎస్సార్ సీపీకి మద్దతు పలకాలని కోరారు. తిరువూరు ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, మల్లేల, చింతలపాడు, ముష్టికుంట్ల పీఏసీఎస్ చైర్మన్లు కలకొండ రవికుమార్, గుడిపూడి నారాయణరావు, బండి రవికుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ ఆవరణలో చేయూత చెక్కు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ తిరువూరు ఇన్‌చార్జి స్వామిదాసు

అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలి

ఘనంగా మహిళా దినోత్సవం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అతిథులు చెప్పారు. రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో ముందస్తు మహిళా దినోత్సవాన్ని సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. డిప్యూటీ డివిజనల్ కార్యదర్శి గద్దా సురేష్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండి మహిళా శక్తిగా ఎదగాలన్నారు. మహిళల సమస్యలను సంస్థ యాజమాన్యం పరిష్కరించాలని కోరారు. మహిళలకు వివిధ రకాలు పోటీలు నిర్వహించారు. చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ శ్రీనివాస్ విజేతలకు బహుమతులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వివిధ సంస్థల ప్రతినిధులు దారా కరుణశ్రీ, జోసఫ్ సామ్యూల్, యూనియన్ నేతలు శివనాగేశ్వరరావు, డేవిడ్‌రాజు, విమల్‌సాయి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను శాఖా గ్రంథాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో సేవలు చేస్తున్న పలువురు మహిళలకు పుష్పగుచ్ఛాలు అందజేసి గౌరవించారు. గ్రంథాలయ నిర్వహణాధికారి శ్రీలత మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మైలవరం: సర్వోన్నత శక్తిగా స్త్రీని ఆరాధించడం భారతదేశ సంప్రదాయమని డాక్టర్ శిరీష తెలిపారు. మైలవరం నారాయణ స్కూల్‌లో గురువారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు పాఠశాల యాజమాన్యం ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. అనంతరం విద్యార్థులతో వారి తల్లులకు పాదాభివందనం చేయించారు. నేటి సమాజంలో స్త్రీలు రాజకీయ, విద్య, వైద్యం, వైమానిక రంగాల్లో రాణించడం ఎంతో సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఎన్టీఆర్ జిల్లా ఏజీఎం హరీష్, గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్ షాబానా తదితరులు పాల్గొన్నారు.



పెనుగొలను గ్రంథాలయంలో మహిళా దినోత్సవం

జి.కొండూరు: మహిళా దినోత్సవం పురస్కరించుకొని జి.కొండూరు ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మను స్థానిక కేడీసీసీ బ్యాంకు ఉద్యోగులు గురువారం సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేడీసీసీ డైరెక్టర్ గుమ్మడపు రవీంద్రరాణా మాట్లాడుతూ రాజకీయ రంగంలో లక్ష్మీతిరుపతమ్మ ఎదుగుతున్న తీరు ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజరు స్వాతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏ కొండూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకొని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు బి.నిర్మల, జి.ప్రసూన, బి.భారతి, శ్రీదేవి, చంద్రికతో పాటు మధ్యాహ్న భోజనం నిర్వాహకులు, ఆయాలకు ఎస్టీయూ మండలశాఖ వారు ఘనంగా సన్మానించి పురస్కారం, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర సెక్రటరీ ఎం.బసవయ్య, ఎంఈఓ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



జి.కొండూరు కేడీసీసీ బ్యాంకులో ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మను సత్కరిస్తున్న దృశ్యం



మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులకు సన్మానం

విద్యుత్ అక్రమ వినియోగంపై రూ.4.96 లక్షల జరిమానా

తిరువూరు: పట్టణంలో కరెంట్ అక్రమ వాడకందారులపై విద్యుత్ విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. నివాసగృహాలు, వాణిజ్య సముదాయాల్లో తనిఖీలు చేసి అనుమతికి మించి విద్యుత్ వినియోగిస్తున్న వారికి రూ.4.96 లక్షల జరిమానా విధించారు. విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 38 బృందాలు 2464 గృహ సర్వీసులను, 548 వాణిజ్య సముదాయాల్లో సర్వీసులను తనిఖీ చేశారు. 151 సర్వీసులకు అదనపు లోడ్ 216 కిలోవాట్లు వినియోగిస్తున్నట్లు గుర్తించి జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, ఇటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని ఈఈ హెచ్చరించారు. నూజివీడు విద్యుత్ శాఖ ఈఈ సత్యనారాయణ, తిరువూరు డీఈ పి.రామకృష్ణ, ఏఈ షఫీ తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు.

సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మృతి



విస్సన్నపేట: స్థానిక కమ్మటూరుకు చెందిన సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నేత గుర్రం వెంకటేశ్వరరావు (60) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి.. వెంకటేశ్వరరావు భౌతికకాయం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లీశ్వరి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, సొసైటీ అధ్యక్షుడు రెడ్డి ముత్యాలరావు తదితరులు నివాళులర్పించారు.

పెనుగొలనులో 'అయ్యంకి' వర్ధంతి

పెనుగొలను(గంపలగూడెం): గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య వర్ధంతిని పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవాసమితి ఆధ్వర్యాన గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గ్రంథాలయ నిర్వహణాధికారి శ్రీలత, ఎంపీపీఎస్ హెచ్ఎం ఏవీ నరసింహారావు, పలువురు విద్యార్థులు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్‌ల్లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గురువారం పోలీసులకు లభ్యమైంది. వయస్సు సుమారు 50ఏళ్లు, ఎత్తు 5.7 అడుగులు ఉన్నట్లు గుర్తించారు. మృతుడు గోధుమ రంగు నిలువు చారలు ఫుల్ హ్యాండ్ షర్ట్, తెలుపు రంగు ఫుల్ బనియన్, సిమెంట్ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు సీఐ ఎం. సత్యనారాయణ 9440627084, గుంటుపల్లి సెక్టార్ ఎస్ఐ బి.అనూష 9390681266కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

పది విద్యార్థులకు వీడ్కోలు

సత్యాలపాడు(గంపలగూడెం): గంపలగూడెం మండలం సత్యాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు, పాఠశాల వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కేడీసీసీబీ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు మాట్లాడుతూ పది తర్వాత విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు వెళ్లాలన్నారు. ఆటల పోటీల్లో విజేతలకు స్థానిక సొసైటీ సౌజన్యంతో బహుమతులు అందజేశారు. సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బరిగెల రామారావు, హెచ్ఎం ఎంఆర్ శేషంరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిమాన్వితుడు బాలకోటేశ్వరస్వామి

వెల్వడం(మైలవరం): మండలంలో వెల్వడం గ్రామంలోని శివాలయంలో బాలకోటేశ్వరస్వామి మహిమాన్వితుడు. గతంలో వెల్వడం శివాలయానికి మైలవరం మండలం నుంచే గాక తిరువూరు, నూజివీడు, తెలంగాణ రాష్ట్రంలోని మధిర, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున ఎడ్ల బండ్లలో ఇక్కడకు వచ్చేవారు. శ్రీబాలకోటేశ్వరస్వామికి మొక్కులు తీర్చుకునే వారు. 250 సంవత్సరాల క్రితం వెల్వడం గ్రామానికి చెందిన యరమల కృష్ణారెడ్డికి శ్రీబాలకోటేశ్వరస్వామి కలలో కన్పించి తనకు ఆలయం కట్టించాల్సిందిగా చెప్పినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో యరమల కృష్ణారెడ్డి వెల్వడం శివారులోని చెరువు వద్ద గానుగ సున్నంతో శ్రీస్వామి వారి ఆలయం నిర్మించారు. అనంతరం లకిరెడ్డి బాలిరెడ్డి తండ్రి లక్ష్మీరెడ్డి ఆలయం సమీపంలో కోనేరు, దాని పక్కన బావి కూడా తవ్వించారు. భక్తులు కోనేరులో స్నానాలు ముగించుకుని స్వామి వారి దర్శనం చేసుకునే వారు. పిల్లలు లేని దంపతులు పొర్లు దండాలు చేస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని నమ్మకం. వారి వారసులు యరమల నాగిరెడ్డి, యరమల గంగాధరరెడ్డి ఆలయం తిరునాళ్ల, నిత్య పూజలు నిర్వహించేవారు. వీరిని అయ్యవార్లు అని పిలుస్తారు. ప్రస్తుతం ప్రవాసాంధ్రులు లకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఆలయ నిర్వహణ చూస్తున్నారు.

ప్రసిద్ధి చెందిన వెల్వడం శివాలయం



వెల్వడంలోని శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం

మూడు రోజులు తిరునాళ్ల

శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి తిరునాళ్ల మూడు రోజులు జరుగుతాయి. మొదటి రోజు స్వామి వారి కల్యాణం, రెండో రోజు రథయాత్ర, మూడో రోజు నారగ్యాలు(గతంలో కత్తులతో పొడుచుకునే వారు) జరిగేవి. దేవుని చిత్తంతో వారికి గాయాలయ్యేవి కావని గ్రామస్తులు చెబుతారు. చివరి రోజు దేవుని ఊరేగింపు కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహిస్తారు. ఊరేగింపులో చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి ప్రభలు కట్టుకుని భక్తులు పాల్గొంటారు. గొర్రెల కాపరులు తమ గొర్రెలతో గిరి ప్రదక్షిణ చేయిస్తారు. ఏటా లకిరెడ్డి సోదరుల సహకారంతో శివరాత్రికి ఇక్కడ నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వెల్వడం గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రులు శివరాత్రికి తప్పని సరిగా గ్రామానికి చేరుకుని పండుగ జరుపుకోవడం ఆనవాయితీ.

వసతుల ఏర్పాటు

మైలవరం మండలం వెల్వడం గ్రామంలో వేంచేసియున్న శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందినదని యరమల నరసింహారెడ్డి తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ఏడాది డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి సౌజన్యంతో గ్రామస్తుల సహకారంతో గతంలోని మట్టి రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేశారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఐడీఏలో ఆర్చ్ లేబొరేటరీస్ సంస్థలో ప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్ గురువారం నిర్వహించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు మాక్‌డ్రిల్ జరిగింది. లేబొరేటరీ ట్యాంకర్‌లో అమ్మోనియా గ్యాస్ లీకేజీ అయిన వెంటనే సైరన్ మోగించి కార్మికులను అప్రమత్తం చేశారు. ఫైర్ సిబ్బంది ఫోమ్ వాటర్‌తో అమెనియా లీకేజీ అరికట్టారు. సెర్చింగ్, రెస్క్యూ టీమ్, ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగారు. గాయపడిన 60మంది కార్మికులను నిచ్చెన ద్వారా కిందకు దించి 108, ఇతర అంబులెన్స్‌ల ద్వారా ప్రాథమిక చికిత్స కేంద్రానికి తరలించారు. తీవ్రంగా గాయపడిన 20మందికి పీహెచ్‌సీ వైద్యురాలు పద్మావతి, వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు. మాక్‌డ్రిల్ ప్రదర్శన ఆద్యంతం ఉత్కంఠ రేకెత్తించింది. 53వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా జరిగిన సమావేశంలో పరిశ్రమల శాఖ డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు జీరో స్థాయికి చేర్చాలన్నారు.



అమోనియా గ్యాస్ లీకేజీని ఫోమ్ వాటర్‌తో ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

శివాలయాలకు విద్యుత్ దీపాలంకరణ



తిరువూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తిరువూరులోని శివాలయాలకు విద్యుద్దీపాలంకరణ చేశారు. పాత బస్టాండు సెంటర్ చంద్రమౌళీశ్వరాలయం, కొత్త బస్టాండు సెంటర్‌లోని రామలింగేశ్వరాలయం, మునుకుళ్ల కాశీ విశ్వేశ్వరాలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకోడానికి ఏర్పాట్లు చేశారు. తిరువూరు నుంచి ఖమ్మం జిల్లా నీలాద్రి, గుట్టపాడు శివాలయాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

విస్సన్నపేట: కొండపర్వ గ్రామంలో వేంచేసి ఉన్న భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి నిర్వహిస్తారని ఆలయ చైర్మన్ గొట్టిపూళ్ల బుచ్చివెంకట్రామలక్ష్మీనరసింహారావు గురువారం తెలిపారు.

అవకాశాలు వినియోగించుకోండి

రెడ్డిగూడెం: ఏపీ విద్యాశాఖలో విప్లవాత్మకమైన మార్పులు అమలవుతున్నాయని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంఈఓ పి.రమేష్ అన్నారు. నాగులూరు విజయబాబు కాలనీ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం గురువారం జరిగింది. ఎంఈఓ మాట్లాడుతూ చదువుకోవానికి అవసరమైన అన్ని సౌకర్యాలు ఉచితంగా ప్రభుత్వ స్కూళ్లలో అందుతున్నాయని తెలిపారు. నాగులూరు కాంప్లెక్స్ చైర్మన్ ఎం. వరలక్ష్మి మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి అన్ని మండలాల్లో ఉన్న పాఠశాలల్లో హైస్కూల్లో ప్లస్ కూడా ప్రారంభమవుతుందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. అనుగ్రహప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థికి ఇబ్బందులు లేకుండా పాఠ్య పుస్తకాల్లో పేజీ ఒక వైపు ఇంగ్లిష్‌లో ఇస్తే రెండో వైపు తెలుగులో కూడా ముద్రితమవుతుందని పూర్తిగా కలర్ పేజీలలో విద్యార్థిలో ఆసక్తి కలిగించే విధంగా పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు అనంతరం ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని పి.నాగమణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ రమేష్

ప్రతి ఒక్కరూ చదువుకోవాలి

తిరువూరు: బాలికా విద్యకు ప్రభుత్వాలు తోడ్పాటునందిస్తుండటంతో ప్రతి ఒక్కరూ చదువుకోవాలని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ అన్నారు. ఏ కొండూరు కస్తూర్బా బాలికా విద్యాలయంలో గురువారం మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. చదువును మించిన ఆస్తి లేదని, తల్లిదండ్రులు తమ కుమార్తెలను సాధ్యమైనంత వరకు చదివించాలని, కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడటానికి విద్య మూలకారణమని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంకిరెడ్డి అంజన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మెరీనా బేగమ్, ఏసీపీ బడేమియా, ఏజీపీ రాము తదితరులు పాల్గొన్నారు.



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మోతీలాల్

విద్యతోనే మహిళా సాధికారత



నూజివీడు: ఆడపిల్లలందరూ చదువుకున్నప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని 15వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎ.నాగశైలజ అన్నారు. పట్టణంలోని సారథి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన మహిళా దినోత్సవం కార్యక్రమంలో జడ్జి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జి.లక్ష్మయ్య, కళాశాల ప్రిన్సిపాల్ సూరానేని శ్రీధర్, ఏఓ గోపిశెట్టి రామచంద్రరావు, న్యాయవాది ఎ.రమా కుమారి, విద్యార్థులు, ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

నూజివీడు: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మహిళలందరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆర్డీఓ వై.భవానీశంకరి అన్నారు. పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, మెప్మా సీఎంఎం ఆనంద్, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

–గొల్లపల్లి హైస్కూల్‌లో పాఠశాల హెచ్ఎం పొట్లూరి రాధికారాణితో పాటు ఉపాధ్యాయినులను సన్మానించారు.

సమన్వయంతో పట్టణాభివృద్ధి

మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ



నూజివీడు: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పట్టణాభివృద్ధి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పట్టణ అభివృద్ధికి రూ.16 కోట్లు మంజూరు చేసిన నేపథ్యంలో ఆ నిధులతో పట్టణంలోని 32 వార్డుల్లో సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. సమావేశంలో కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, మున్సిపల్ డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి రామిశెట్టి మురళీకృష్ణ, లాం ప్రసాదరావు, షేక్ మెహబూబీబీ, మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రణాళికతో ఉన్నత శిఖరాలకు..

వెల్వడం(మైలవరం): విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని ప్రవాసాంధ్రుడు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి తెలిపారు. మైలవరం మండలం వెల్వడం గ్రామంలోని లకిరెడ్డి పావులమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మించిన పాఠశాల భవనాన్ని గురువారం లకిరెడ్డి హనిమిరెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. పై అంతస్తును ప్రవాసాంధ్రులు లకిరెడ్డి జయప్రకాష్ రెడ్డి, న్యాయవాది లకిరెడ్డి సిద్ధార్థరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలు దేవాలయాలని, విద్యార్థులు దేవుళ్లతో సమానమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల సాగుతో అధిక ఆదాయం



నూజివీడు: ఔషధ మొక్కల సాగు ద్వారా రైతులు ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చని వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త అపర్ణ అన్నారు. మండలంలోని హనుమంతులగూడెంలో అఖిల భారత సమన్వయ పరిశోధన పథకం కింద ఎస్సీ సబ్‌ప్లాన్ పథకంలో భాగంగా గురువారం రైతులకు ఔషధ, సుగంధ మొక్కల సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

శోభనాచలుని ఆలయ హుండీ కానుకల లెక్కింపు

ఆగిరిపల్లి: స్థానిక శ్రీశోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయంలో గురువారం దేవదాయ ధర్మాదాయ శాఖ నేతృత్వంలో హుండీ కానుకలను ఆరు నెలల వరకు వచ్చిన వాటికి లెక్కింపు నిర్వహించగా రూ.2,02,024 ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి భవాని చెప్పారు. లెక్కింపు కార్యక్రమాన్ని గన్నవరం గ్రూప్ ఆలయ కార్యనిర్వహణ అధికారి సుధాకర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

విహారయాత్రలతో మానసిక వికాసం



ఆగిరిపల్లి: విజ్ఞాన విహార యాత్రలు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయని వట్టిగుడిపాడు మండల ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఇందిర అన్నారు. వట్టిగుడిపాడులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం, భవానీ ద్వీపం, ఉండవల్లి గుహలు, గాంధీ క్షేత్రాలను సందర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంకం వెంకటేశ్వరరావు, నాగశ్రీ, సుప్రియ, జోష్ణదేవి పాల్గొన్నారు.

శివరాత్రికి ఆలయాల ముస్తాబు

ఆగిరిపల్లి: శివరాత్రి సందర్భంగా మండలంలోని పలు గ్రామాలు ఉన్న శివాలయాలు ముస్తాబయ్యాయి. స్థానిక సత్రం సెంటర్లోని గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయం, శోభనాచలుని ఎగువ కొండపై స్వయంభుగా వెలసిన దుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామి ఆలయం, ఈదులగూడెంలోని నాగేశ్వరస్వామి ఆలయం, సురవరంలోని ముక్తేశ్వర స్వామి ఆలయం, కనసానపల్లిలోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాలను శివరాత్రి వేడుకలకు అలంకరించారు.

అన్నవరంలో శివ పంచాక్షరీ ఏకాహం

నూజివీడు: మండలంలోని అన్నవరంలో శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి భావరాజు పుల్లారావు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 9వ తేదీ ఆరు గంటల వరకు 24 గంటల పాటు శివ పంచాక్షరీ ఏకనామ జప భజన నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 57 మంది గైర్హాజరు

నూజివీడు: ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షల్లో భాగంగా గురువారం గణితం 2ఏ, బోటనీ, సివిక్స్ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు 57 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ శారద జూనియర్ కళాశాల, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాల, శ్రీ సిద్దార్థ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

పాస్‌పోర్టు పోయినది

బొల్లెపోగు అశోక్, యన్.టి.ఆర్. జిల్లా, గంపలగూడెం మండలం, అర్లపాడు గ్రామం, డోరు నెం. 2-215 నివాసినైన నాకు సంబంధించిన పాస్‌పోర్ట్ నెం. R3017217 ది. 24-11-2023న అర్లపాడు నుండి మెయిన్ రోడ్డులో గంపలగూడెం వస్తుండగా మార్గం మధ్యలో పోయినది. ఎవరికైనా దొరికినచో పై అడ్రస్సుకు గానీ క్రింది ఫోన్ నెంబర్‌కు గానీ తెలుపగలరు. ✆ 9948894114

కరపత్రాల పంపిణీ

ఎ.కొండూరు: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 14న చలో ఢిల్లీ కార్యక్రమానికి మద్దతుగా మండల కేంద్రాల్లో జరిగే ప్రదర్శన సభలను జయప్రదం చేయాలని కోరుతూ చీమలపాడు గ్రామంలో గురువారం రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యాన కరపత్రాలు పంపిణీ చేశారు. పలువురు సంఘ నేతలు పాల్గొన్నారు.